క్లుప్తంగా

మూడేళ్ల కాలపరిమితిని ఎత్తివేయాలి

కర్నూలు(సెంట్రల్): డీఆర్‌డీఏలో పనిచేసే వీవీఏలకు మూడేళ్ల కాల పరిమితిని ఎత్తి వేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వీవీఏలకు రూ.10 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ చేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఎస్‌హెచ్‌జీ సంఘాల విలీనాలను నిలుపుదల చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, మారెప్ప, మధు, చంద్ర, రంగనాథ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో పైపులైన్ పనుల కోసం తవ్విన సీసీ రోడ్డును వెంటనే నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు.సోమవారం నిలిచిపోయిన పనులను సీపీఎం బృందం పరిశీలించింది.కార్యక్రమంలో నాయకులు శంకర్, ఎం.లోకేష్, ఎం.భాస్కర్, ఎస్.రోశయ్య, ఆర్.మద్దిటి, కె.విక్రం పాల్గొన్నారు.

వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలో కొన్ని చోట్లా అనవసరంగా ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేయడంతో సాఫీగా వెళ్లాల్సిన వాహనాలు నిలిచిపోవాల్సి వస్తోందని పౌర పట్టణ సంక్షేమ సంఘం (పీపీఎస్‌ఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ.పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పీపీఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్‌ను ఉంచి మిగతా ప్రాంతాల్లో తొలగించాలని,సెన్సార్ కెమెరాలను తీసి వేయాలన్నారు.వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.అన్వర్‌బాష, డి.కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ ఆరోగ్యశ్రీ నిధులను విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ నిధులను వెంటనే విడుదల చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వెంటనే పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ నిధులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, నాగరాజు, ఈశ్వర్, అన్వర్, సోమన్న పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి రక్షణ కల్పించండి

కర్నూలు : నిజం గెలవాలి పేరుతో ఈనెల 7, 8 తేదీల్లో జిల్లా పర్యటనకు వస్తున్న నారా భువనేశ్వరికి రక్షణ కల్పించాలని టీడీపీ లీగల్ సెల్ బృందం అడిషనల్ ఎస్పీ నాగరాజుకు వినతిపత్రం సమర్పించింది. రెండు రోజుల పాటు జిల్లాలోని పత్తికొండ, ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో భువనేశ్వరి పర్యటించనున్నారని, ఆమెకు తగిన పోలీసు రక్షణ ఏర్పాట్లు చేయాలని కోరారు. కర్నూలు పార్లమెంట్ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస భట్ తదితరులు సోమవారం ఏఎస్పీని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

31 వరకు లేపాక్షి క్లియరెన్స్ సేల్ మేళా

కర్నూలు(అగ్రికల్చర్): లేపాక్షి హ్యాండీ క్రాఫ్ ఎంపోరియంలో క్లియరెన్స్ సేల్ మేళా చేపట్టినట్లు మేనేజర్ బి.తిమ్మయ్య తెలిపారు. పోచంపల్లి బెడ్‌షీట్లు, కలంకారీ బ్యాగ్‌లు, నారాయణపేట చీరలు, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, నరసాపూర్ అల్లికలు తదితర ఎంపిక చేసిన వాటిపై 10 నుంచి 40 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. కొండారెడ్డి బురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండీ క్రాఫ్ ఎంపోరియంలో ఈ నెల 31 వరకు క్లియరెన్స్ మేళా జరుగుతుందని చెప్పారు. కొండారెడ్డి బురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండీ క్రాఫ్ ఎంపోరియంలో క్లియరెన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిలా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రీవాల్యుయేషన్‌కు అవకాశమివ్వాలని వినతి



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పీజీ విద్యార్థులకు రీ వాల్యుయేషన్‌కు అవకాశం కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ ఆర్‌యూ కమిటీ నాయకులు సోమవారం వర్సిటీరిజిస్ట్రార్ ప్రొఫెసర్ నాగుల అంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల విడుదల చేసిన పీజీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షల్లో చాలా మంది విద్యార్థులు ఫెయిలైనారని వారందరికీ ఇన్‌స్టెంట్ ఎగ్జామ్స్ నిర్వహించాలని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకొచ్చారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి మునిస్వామి, వర్సిటీ కార్యదర్శి .ధనలక్ష్మి, సభ్యులు రాజశేఖర్, భారతి, హుస్సేనమ్మ, దస్తగిరమ్మ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

నగరాభివృద్ధికి పెద్దపీట

- నాలుగున్నరేళ్లలో స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దాం
- కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- ఇంతియాజ్‌బాషాతో కలిసి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్‌బాషా

కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ పాలనలో కర్నూలు నగరాభివృద్ధికి పెద్దపీట వేసినట్లు కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. కోట్లాది రూపాయలతో ప్రగతి పనులు చేపట్టి స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. 23 వ వార్డులో రూ.35 లక్షలతో సీసీ రోడ్లు, 24 వ వార్డులో రూ.87.42 కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, 25 వ వార్డులో కేసీ కెనాల్ నుంచి దేవనగర్ రైల్వే ట్రాక్ వరకు రూ.60 లక్షలతో సీసీ రోడ్డు, 45 వ వార్డులో రూ.40 లక్షలతో నూతనంగా మున్సిపల్ పార్కు అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని సోమవారం వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్‌బాషాతో కలిసి ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఆవిష్కరించి మాట్లాడారు. నాలుగున్నర సంవత్సరాల వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో కర్నూలు నియోజకవర్గం రూపురేఖలు మారాయన్నా రు.గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పేరు తో ఇంటింటికి తిరిగి స్థానిక సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నానన్నారు. ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు గ్రీనరీ, పార్కులు ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు నియోజకవర్గ వర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఇంటింటికి సంక్షేమం అందించిన ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు. గతంతో పోల్చితే కర్నూలు నగరంలో పెద్ద ఎత్తున్న అభివృద్ధి పనులు కళ్లకు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ఇది కదా అభివృద్ధి అంటే అన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా ఆదరిస్తే నగరం మరింత అభివృద్ధిచెందేందుకు దోహదపడతానన్నారు. రాష్ట్రంలోనే కర్నూలును ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో నగరపాలక డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, వార్డు కార్పొరేటర్లు కటారి పల్లవి, సిట్రా సత్యనారాయణమ్మ, రమణమ్మ, మాణిక్యమ్మ, డీపీఎంసీ మెంబర్ ప్రభుదాసు, పార్టీ నగర అధ్యక్షులు ఇర్ఫాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిక



వైఎస్‌ఆర్‌సీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ, కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్

కర్నూలు (టౌన్):నగరపరిధిలోని 6వ వార్డుకు చెందిన పలు కుటుంబాలు సోమవారం వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్ సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక ఎస్వీ స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్వీ, ఇంతియాజ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. బాబు భాయ్, మాలిక్, రెహమాన్, అబారా, షాషావలి, వారి మిత్రులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సీపీ గెలుపు తథ్యం



వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీని శాలువా కప్పి అభినందిస్తున్న పార్టీ బీసీ విభాగం నాయకులు

కర్నూలు (టౌన్): నగరంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ గెలుపు తథ్యమని వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనంజయ్య ఆచారి అన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి స్వగృహంలో కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్‌బాషాను కలిశారు. ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా దేవపూజ ధనంజయ్య ఆచారి మాట్లాడుతూ కర్నూలు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. ముచ్చటగా మూడోసారి కర్నూలులో వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ గెలుస్తుందన్నారు. వైఎస్ జగన్ పాలనలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో విద్యావేత్త, మాజీ కలెక్టర్ ఇంతియాజ్‌ను ప్రజలు ఆదరిస్తారన్నారు. అనంతరం కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందరం కలిసికట్టుగా గడప గడపకు తిరిగి వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరిద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి



ఉత్తమ పురస్కారాలు పొందిన వలంటీర్లతో కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు

- ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో వారిది కీలక పాత్ర
- వలంటీర్లకు వందనంలో కుడా చైర్మన్ కోట్ల హర్ష, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త సతీష్

కర్నూలు సిటీ: గ్రామ/వార్డు సచివాలయ వలంటీర్ల సేవలు ఎనలేనివని కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం 103వ వార్డు సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కర్నూలు అర్బన్ మండల పరిధిలోని 38, 39,40 వార్డులకు చెందిన ఉత్తమ వలంటీర్లను సత్కరించి మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజల దగ్గరకు చేర్చడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య వారు వారధులుగా నిలుస్తున్నారన్నారు. 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ఈ వలంటీర్ల వ్యవస్థ ప్రస్తుతం దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా ప్రత్యేకంగా అభినందిస్తోందన్నారు. ఉత్తమ వలంటీర్లకు సేవా వజ్ర పేరుతో రూ.45 వేల నగదు, సేవా రత్న పేరుతో రూ.30 వేలు, సేవా మిత్ర పేరుతో రూ.15 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తుందన్నారు. వరుసగా నాలుగు ఏడాది నియోజకవర్గంలోని పలువురు వలంటీర్లకు ఈ పురస్కారాలు ప్రదానం చేయడంతో సంతోషంగా ఉందన్నారు. సంక్షేమ పాలనతో పేదవారి గుండెల్లో గుడి కట్టుకున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు మరింత మేలు జరగాలంటే మళ్లీ ఆయనను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం 39వ వార్డు కార్పొరేటర్ సాంబశివరావు, 40వ వార్డు కార్పొరేటర్ విక్రమ్ సింహారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ మండల జెడ్పీటీసీ ప్రసన్న కుమార్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు రాము, గిరి ప్రసాద్, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ బోర్డు మధు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కర్నూలు (హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థులు బీఎస్సీ నర్సింగ్ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్ పెరుగు విజయ వర్ధన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వారు విడుదల చేశారన్నారు. ఇందులో తమ కళాశాలకు చెందిన 49 మంది విద్యార్థులు హాజరు కాగా, అందులో 11 మంది డిస్టింక్షన్, 22 మంది ఫస్ట్ క్లాస్, ఏడుగురు సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు. కళాశాల టాపర్‌గా పి.శ్రీలేఖ 88 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారన్నారు.

నో ఎంట్రీ సమయంలో ఇసుక ట్రాక్టర్లు కనిపిస్తే సీజ్

ఇసుక ట్రాక్టర్ల యజమానులకు సీఐ హెచ్చరిక



ఇసుక ట్రాక్టర్ల యజమానులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ గౌతమి

కర్నూలు: నో ఎంట్రీ సమయంలో ఇసుక ట్రాక్టర్లు నగరంలోకి వస్తే సీజ్ చేస్తామని ట్రాఫిక్ సీఐ గౌతమి యజమానులను హెచ్చరించారు. వన్‌టౌన్ పరిధిలోని ఉస్మానియా కాలేజీ రోడ్డులో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభ, ముగింపు సమయాల్లో ఇసుక ట్రాక్టర్లు ఆ మార్గం గుండా తిప్పరాదని సూచించారు. ఉస్మానియా కాలేజీ మార్గం గుండా ఇసుక ట్రాక్టర్లు తిరుగుతున్నందున ట్రాఫిక్ రద్దీ పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు రావడంతో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి మోటార్ వెహికల్ చట్టం కింద అపరాధ రుసుం విధించారు. ట్రాక్టర్ యజమానులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఉదయం వేళల్లో స్కూల్ పిల్లలు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు ట్రాఫిక్ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాగా జీవనాధారం కోసం ట్రాక్టర్లు నడుపుకుంటున్నామని, మన్నించి ట్రాక్టర్లను వదిలిపెట్టాలని యజమానులు కోరగా అందుకు ఆమె సమ్మతించి మొదటి తప్పిదం కింద వదిలేశారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు హంద్రీ నది నుంచి ఆదివారం రాత్రి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ పోలీసులు పట్టుకున్నారు. వర్కూరుకు చెందిన రాముడు, సుంకన్నలకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు కోడుమూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ రామాంజనేయులు సోమవారం తెలిపారు. అక్రమంగా హంద్రీ నుంచి ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కోడుమూరు సెబ్ పరిధిలోని క్రిష్ణగిరి మండలం కర్లకుంట గ్రామ శివారులో శివన్న అనే వ్యక్తి గుట్టు చప్పుడు కాకుండా నాటు సారా తయారు చేస్తున్నాడు. సోమవారం సెబ్ పోలీసులు దాడి చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సీఐతో పాటు సెబ్ పోలీసులు వెంకటేష్ నాయక్, అప్రోజ్‌బాషా, శంకర్ నాయక్, విరుపాక్షిరెడ్డి పాల్గొన్నారు.

11న మార్కెట్ యార్డులో జంబోషెడ్డు ప్రారంభం



జంబోషెడ్డు పనులను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సెక్రటరీ గోవిందు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.6 కోట్లతో 150 మీటర్ల పొడవు, 21 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న జంబోషెడ్డు ఈనెల 11వ తేదీ ప్రారంభించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జంబోషెడ్‌కు జీఐ ప్రొఫైల్ షీట్‌లతో పైకప్పు వేసే పనులు రెండు రోజులుగా జరుగుతున్నాయి. ఆ పనులను మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందుతో కలిసి సోమవారం చైర్మన్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మార్కెట్‌లో వ్యవసాయ పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు జంబోషెడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వడ్డీ మాఫీని వినియోగించుకోండి



బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ కూడలిని పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : నగరపాలక పరిధిలో ఆస్తి పన్ను బకాయిదారులకు ప్రభుత్వం వడ్డీ మాఫీ ప్రకటించినందున వినియోగదారులు వినియోగించుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో నగరపాలక రెవెన్యూ విభాగం ఇన్‌స్పెక్టర్లు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో నివసిస్తున్న ప్రజలు తమ ఆస్తి పన్ను, నీటిపన్ను బకాయిలు చెల్లించాలన్నారు. ఈనెలాఖరు నాటికి పెండింగ్ లేకుండా పన్నులు చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించాలన్నారు. బకాయిలు ఉన్న ఆస్తి పన్ను, ఖాళీ స్థల పన్ను (వెకేట్ ల్యాండ్ ట్యాక్స్) వంటివి చెల్లించిన వారికి వడ్డీ మాఫీ ఉంటుందని చెప్పారు. గడువు దాటిన వారిపై ప్రభుత్వ పరంగా చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు వాజిద్, రాజు, మన్సూర్ పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్ల అభివృద్ధికి చర్యలు

పెరిగిన జనాభా, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని నగరంలో ప్రధాన కూడళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం నగరంలోని వివిధ ముఖ్య కూడళ్లను నగరపాలక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్‌తో కలిసి పరిశీలించారు. బళ్లారి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై ట్రాఫిక్ అధికారులతో చర్చించారు.

ఆరోగ్యానికి మించిన సంపద లేదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): మనిషికి ఆరోగ్యానికి మించిన సంపద లేదని, దురలవాట్లకు దూరంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించగలమని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. స్థానిక చదువుల సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నా ఆరోగ్యం సరిగా లేకపోతే వారి జీవితం దుర్భరంగా ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. పోషకాహార లోపం వల్ల అనేక వ్యాధులకు గురవుతున్నారని, ప్రతి ఒక్కరూ వారి పరిస్థితులకు అనుగుణంగా పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జగన్నాథం, రామకృష్ణారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియోచుక్కలు

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్



పల్స్‌పోలియో కార్యక్రమం గురించి డాక్టర్ సందీప్ పటేల్‌కు వివరిస్తున్న ప్రవీణ్‌కుమార్

కర్నూలు (హాస్పిటల్): జిల్లాలో సున్నా నుంచి ఐదేళ్లలోపు పిల్లలను ఏ ఒక్కరినీ వదలకుండా పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం నగర శివారులోని బి.తాండ్రపాడు, హుసేనాపురం, కాల్వబుగ్గ గ్రామాల్లో జరుగుతున్న డోర్ టు డోర్ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సౌత్ ఇండియా రీజియన్ టీమ్ లీడర్ డాక్టర్ సందీప్ పటేల్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి ఒక్క చిన్నారికీ పల్స్‌పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. ఈ రోజు, రేపు కూడా గృహ సందర్శనలు చేసి పిల్లలకు పోలియో చుక్కలు వేసి పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని సూచించారు. హైరిస్క్ ఏరియాలైన వలసలతో కూడిన మురికివాడలు, నిర్మాణ స్థలాలు, సంచార జాతులు, ఇటుకల బట్టీలు, ఇతర ఫ్యాక్టరీ ప్రాంతాల్లో నివసించే పిల్లలకు తప్పకుండా పల్స్‌పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. ఈ మూడు రోజుల్లో వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

కర్నూలు కల్చరల్: ఆర్‌యూ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో 2015 నుంచి 2021 సంవత్సరం మధ్యలో చదివి ఫెయిలైన విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నాగు ల అంకన్నకు వినతి పత్రం అందజేశారు. గతంలో డిగ్రీ విద్యార్థులు పరీక్షల్లో ఫెయిలైతే ఎప్పుడైనా పరీక్షలు రాసుకునే వెసలుబాటు ఉండేదని, సెమిస్టర్ విధానం అమల్లోకి రావడంతో కేవలం 3 సంవత్సరాల్లోనే ఫెయిలైన వారు పరీక్షలు రాసేలా నిబంధన ఉందని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో చాలా మంది విద్యార్థులు పరీక్షలు రాసే అవకాశం కోల్పోతున్నారని పేర్కొన్నారు. సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిలైన వారందరికీ అవకాశం కల్పించాలని విన్నవించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్‌కు వినతి

కర్నూలు సిటీ: తమకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని, ఆలస్యం చేయకుండా వివరాలు సమగ్ర స్టేట్ ఆఫీస్‌కు పంపించాలని అనియత విద్యలో ఇన్‌స్ట్రక్టర్స్, సూపర్‌వైజర్లుగా పనిచేసిన వారు సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ సీహెచ్ విజయజ్యోతి కుమారికి విన్నవించారు. సోమవారం నాన్-ఫార్మల్ ఎడ్యుకేషన్ సూపర్ వైజర్లు, ఇన్‌స్ట్రక్టర్ల అసోసియేషన్ నాయకులు ఆమెను కార్యాలయంలో కలిసి మాట్లాడారు. 1975లో అనియత విద్య పథకంలో భాగంగా బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించి చదువు చెప్పేందుకు తమను నియమించారన్నారు. 2001లో అనియత విద్య పథకాన్ని రద్దు చేసి తమలో కొందరిని సమగ్ర శిక్షలో సీఆర్‌పీలుగా అవకాశం ఇచ్చారన్నారు. మిగిలిన వారికి కూడా ఇవ్వాలని విద్యాశాఖ మంత్రిని కోరగా అంగీకరించినట్లు చెప్పారు. వినతి పత్రమిచ్చిన వారిలో నాయకులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, బుడ్డన్న పాల్గొన్నారు.

రజక విద్యార్థులు విద్య, ఉపాధి రంగాల్లో రాణించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రేణుక

కర్నూలు(అర్బన్): రజక సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు కష్టపడి చదివి విద్య, ఉపాధి రంగాల్లో రాణించాలని రజక విద్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీపీ వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు రేణుక కోరారు. సోమవారం నగరంలోని అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లో విద్య సేవా సమితి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువు విలువ తెలియక నేటికి అనేక మంది రజకులు తమ పిల్లలను కుల వృత్తికి ఉపయోగించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా 'చాకిరేవు వద్దు - చదువే ముద్దు ' అనే నినాదంతో విద్యకు దూరంగా ఉన్న రజకులను విద్యా పరంగా ప్రోత్సహించాలన్నారు. రజక కార్పొరేషన్ ద్వారా బ్యాంకుల ప్రమేయం లేకుండా రజకులకు నేరుగా రుణాలు అందించాలన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటించి రజకుల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో పలు రజక సంఘాల నాయకులు వేంపెంట రాంబాబు, గణేష్, లింగమయ్య, కన్నాదేశాయ్, వెంకటస్వామి, రామక్రిష్ణ, లీలావతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మున్సిపల్ అధికారులు

కర్నూలు (టౌన్): ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక ఎస్‌ఈ వేణుగోపాల్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శైలత, నగరపాలక కార్యదర్శి నాగరాజు, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

వినతులు ఇవే..

- నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ నుంచి శ్రీరామనగర్‌ను కలుపుతూ దారి ఏర్పాటు చేయాలని స్థానిక కాలనీ వాసులు రమేష్‌కుమార్, రాజన్న విన్నవించారు.
- 87 వ రెవెన్యూ వార్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కుమ్మరి మద్దమ్మ కోరారు.
- ఇందిరాగాంధీనగర్‌లో పైపు లైన్‌కోసం తవ్విన రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికుడు టి.రాముడు అభ్యర్థించారు.
- వీఎల్‌టీ పన్ను వేయాలని లావణ్య అనే మహిళ కోరారు.
- వితంతు పెన్షన్ మంజూరు చేయాలని ఎస్. మాధవి, వెంకటరమణమ్మ అనే మహిళలు వేర్వేరుగా విన్నవించారు.
- మామిదాల పాడులోని పంచముఖినగర్‌లో మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని అయ్యన్న అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.
- చంద్రశేఖర్ నగర్ నుంచి జోహరాపురం వెళ్లే మెయిన్ మార్గంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని రామక్రిష్ణ, రాజశేఖర్ రెడ్డి విన్నవించారు.